అయ్యప్ప ధర్మశాస్త్ర సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న అయ్యప్ప ధర్మశాస్త్ర సేవా సమితి ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: చింతల్‌కు చెందిన అయ్యప్ప ధర్మశాస్త్ర సేవాసమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ, పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రుల ప్రాంగణాల్లో ఆదివారం సుమారు 500 మంది నిరుపేద రోగి సహాయకులకు, అభాగ్యులు, అన్నార్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. గత దశాబ్దకాలంగా అయ్యప్ప ధర్మశాస్త్ర సేవాసమితి నేతృత్వంలో అనేక సామాజిక, ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా రమణగురు స్వామి హాజరయ్యారు. కార్యక్రమంలో అయ్యప్ప ధర్మశాస్త్ర సేవసమితి అధ్యక్షుడు వెంకటేష్ (బొంబాయి గురుస్వామి) ప్రతినిధులు కేవీ రాజేంద్రప్రసాద్, పుల్లారావు, శ్రీనివాస్, జనార్ధనరెడ్డి, శివకిషోర్, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, మురళీ, ఈశ్వర్‌రెడ్డి, కిషోర్, తిరుపతిరావు, నాగయశస్వి, కేసన, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

రోడ్లపైనే వదిలేసిన చెట్ల కొమ్మలు



ఇందిరానగర్‌లో రోడ్లపై వదిలేసిన చెట్లకొమ్మలు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కాలనీ, బస్తీ అంతర్గత రోడ్లపై ఎక్కడ చూసినా నరికి పారేసిన చెట్ల కొమ్మలే దర్శనం ఇస్తున్నాయి. లాలాపేట ఇందిరానగర్ బీ– కాలనీలో వారంరోజుల క్రితం జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారులు ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను, విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేయించారు. అయితే ఆ నరికిపారేసిన చెట్ల కొమ్మల వ్యర్థాలను తొలగించకుండా ఇళ్ల మధ్యలోనే వదిలేశారు. దీంతో స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చెట్ల కొమ్మలు, ఆకులు రోడ్డంతా పరుచుకుంటున్నాయి. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఇందిరానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నేతికార్ మహేశ్ అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరించిన ఆలయ ఈఓ చైర్మన్

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి తమ్మినేని శేఖర్, చైర్మన్ సాయిబాబాగౌడ్ తెలిపారు. ఆదివారం దసరా నవరాత్రి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి సెప్టెంబర్ 2 వరకు వేడుకలు జరుగుతాయన్నారు. ప్రతీ రోజు గర్భగుడిలో అమ్మవారిని, మూల విరాట్‌ను రోజుకో ప్రత్యేక రూపంలో అలంకరించనున్నట్లు చెప్పారు. ఉదయం హోమం ఉంటుందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ఓయూలో ఆర్ఎస్ఎస్ విజయ దశమి ఉత్సవం



లాలాపేట: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విజయ దశమి ఉత్సవం ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గోసేవా ప్రముఖ వెంకట్ నివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం స్వయం సేవలకు కృషి ఫలితమే అన్నారు. శతాబ్దకాలంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని దేశ ప్రజల సంస్కృతి సంరక్షణ కోసం ఆర్ఎస్ఎస్ నిలబడిందన్నారు. కుటుంబ ప్రబోధన్, పర్యావరణము, సామాజిక సమరసత, స్వదేశీ, శిష్టాచారాలపై సమాజాన్ని చైతన్యం చేయాలని స్వయం సేవకులను సూచించారు. ఈ కార్యక్రమంలో బర్కతపురా బాగ్ సహ కార్యదర్శి మద్దూరి నర్సింలు, పెండెం విజయ్, అచ్యుత్, ప్రసాద్, గణేశ్ తదితరులున్నారు.

దేవీ శరన్నవరాత్రులకు ముస్తాబైన ఆలయాలు

సనత్‌నగర్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. అమ్మవారు రోజుకొక అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. నవరాత్రి పూజల్లో భాగంగా అమ్మవారి ఆలయాల్లో లలితా సహస్రనామ కుంకుమార్చన, చండీహోమం, సరస్వతీపూజ, సుమంగళి పూజ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సనత్‌నగర్ హనుమాన్‌దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 22 సోమవారం అక్టోబర్ 2 వరకు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. 22న బాలాత్రిపురసుందరీదేవి అలంకారం, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణ, 25న మంగళగౌరీదేవి, 26న గజలక్ష్మీదేవి, 27న లలితాదేవి, 28న కాత్యాయనీదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్ధిని, 2న విజయ దశమి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. 30న అమ్మవారిని సుగంధద్రవ్యాలతో అభిషేకం, సుమంగళిపూజ ఉంటుందని తెలిపారు. అలాగే అక్టోబర్ 1న మహార్నవమి రోజున ఉదయం చండీహోమం జరుగుతుందన్నారు.

బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో...

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను కట్టమైసమ్మ ఆలయంలో వైభవోపేతంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ సుభాష్‌ముదిరాజ్ తెలిపారు. అక్టోబర్ 2 వరకు రోజుకొక అలంకరణలో అమ్మవారిని ముస్తాబు చేయనున్నట్లు తెలిపారు. అలాగే అక్టోబర్ 1న ఉదయం చండీహోమం, ప్రతిరోజూ లలితా సహస్రనామ కుంకుమార్చన, 108 బంగారు పుష్పాలతో సువర్ణ పుష్పార్చన నిర్వహిస్తామన్నారు.

ప్రకాష్‌నగర్ భూలక్ష్మి ఆలయంలో...

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బేగంపేట్ ప్రకాష్‌నగర్‌లోని భూలక్ష్మి అమ్మవారి ఆలయ ధర్మకర్త విశాల్‌సుదం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 22న అమీర్‌పేట నృత్యాంజలి అకాడమీకి చెందిన రజనీమయి చకిలం శిష్యబృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, 23న వరాహ సిస్టర్స్ కోలాటం గ్రూపుతో కోటాలం నృత్య ప్రదర్శన, 24న దత్త కూచిపూడి నాట్య కళాక్షేత్రం వారి శిష్య బృందంతో నృత్య ప్రదర్శన, 25, 26, అక్టోబర్ 1 తేదీల్లో దాండియా నైట్, 26న ఉదయం 10.30 గంటలకు సౌందర్య లహరిపూజ పారాయణం, 27న శ్రీనివాస నృత్య నాటక ప్రదర్శన, 28న శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి కళాయణం 29న ఉదయం 10 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం, 30న ఉదయం సామూహిక చండీహోమం, సాయంత్రం బతుకమ్మ వేడుకలు, అక్టోబర్ 2న శమీపూజ, రావణ దహనం, దత్త కూచిపూడి నాట్య కళాక్షేత్రం గురువుపావని మఠం వారి శిష్య బృందంతో రామలీల నృత్యరూపక ప్రదర్శన ఉంటాయని వివరించారు.

దేవాలయం ముస్తాబు

దేవిశరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. అమ్మవారి గర్భగుడితో పాటు దేవాలయం మొత్తం పువ్వులతో అలంకరణ,



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు విద్యుద్దీపాలతో సనత్‌నగర్ హనుమ దేవస్థానం

సుభాష్‌రోడ్‌తో పాటు దేవాలయ పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో ముస్తాబు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు, ప్రసాదాలు, మంచి నీళ్ల పంపిణీ చేస్తామన్నారు.

బౌద్ధనగర్: డివిజన్‌లోని కనకదుర్గా దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ ధరణిధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ నవరాత్రి వేడుకలు వచ్చే నెల 2 వరకు కొనసాగుతాయన్నారు. ఈ నెల 29న రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర ముఖ్యమంత్రి అమ్మవారికి పట్టు వస్త్రములు సమర్పించనున్నట్లు తెలిపారు. అదే విధంగా 2న విజయదశమి సందర్భంగా ఉదయం 9.30 గంటలకు మహాపూర్ణాహుతి ఉంటుందని తెలిపారు. భక్తులందరూ ప్రతీరోజు అమ్మవారిని దర్శించుకొని ఆమె కృపకు పాత్రులు కావాలని కోరుతున్నామన్నారు.



నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి దేవిశరన్నవ రాత్రి మహోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి అన్నారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి రామేశ్వర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రతీరోజు అమ్మవారు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారని ప్రతీరోజు ఉదయం 9.30 గంటలకు అలంకార దర్శనం ఉంటుందని చెప్పారు. 22న బాలత్రిపుర సుందరీదేవి, 23న గాయత్రి దేవి, 24న రాజరాజేశ్వరీదేవి, 25న అన్నపూర్ణా దేవి, 26న గజలక్ష్మీదేవి, 27న భవానీదేవి, 28న తేదీండీదేవి, 29న సరస్వతిదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్ధినిదేవి, 2న మహాకాళి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనం ఇస్తారని చెప్పారు. ప్రతీరోజు అభిషేకాలు, కుంకుమార్చన, చండీహోమం తదితర పూజలు జరుగుతాయని తెలిపారు. 30న దేవాలయ ప్రాంతంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తామని వివరించారు. ప్రతీరోజు సాయంత్రం 6 గంటల నుంచి దేవాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు.

రమావత్ నాగేశ్వర్‌రావుకు డాక్టరేట్



లాలాపేట: నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్, నెల్లికల్ తండా ఎర్రచెరువు గ్రామానికి చెందిన రమావత్ దేవా, మంగమ్మల కుమారుడు రమావత్ నాగేశ్వర్‌రావు ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను పొందారు. ఈ మేరకు ఓయూ ప్రభుత్వ పాలనా శాస్త్రం ప్రొఫెసర్ డి. లలిత్‌కుమార్ పర్యవేక్షణలో 'పాలసీస్ అండ్ ప్రోగ్రామ్స్ ఫర్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏ స్టడీ ఆఫ్ అంబ్రెళ్ల స్కీం(ట్రైబల్ ఎడ్యుకేషన్) ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. నాగేశ్వర్‌రావు నిజాం కళాశాలలో డిగ్రీ చదువుతున్న క్రమంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైయారు. కానీ ఉన్నత చదువుపై ఉన్న మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేసి పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశాడు.

స్ఫూర్తి దాత డా. బీఆర్ అంబేడ్కర్



లాలాపేట: భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్. అంబేడ్కర్‌ను దళిత బహుజనులు నిరంతరం స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత విద్యావంతులుగా తయారు కావాలని పలువురు నేతలు అన్నారు. ఆదివారం తార్నాక చింతల్‌లో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి చింతల్ బస్తీ నాయకులు జ్ఞాన మాల సమర్పించారు. అట్టడుగు వర్గాల్లో జన్మించిన అంబేడ్కర్ ఉన్నత విద్యను అభ్యసించి ప్రపంచ మేధావిగా పేరుగాంచారని కొనియాడారు. అదేవిధంగా దళితులంతా వృద్ధిలోకి రావాలనే ఉద్దేశ్యంతోనే ప్రతీ ఆదివారం జ్ఞానమాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తుంగ లక్ష్మణ్, ప్రసన్న, మనోహర్, రాజయ్య తదితరులున్నారు.

ఆలయాల వద్ద ఏర్పాట్లు చేయాలి

డిప్యూటీ కమిషనర్‌కు బీఆర్ఎస్ విజ్ఞప్తి



డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్‌కు వినతిపత్రం సమర్పించిన బీఆర్ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: దేవీ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు అమ్మవారి దేవాలయాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు బేగంపేట్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రాసిన లేఖను బీఆర్ఎస్ నాయకులు వెంకటేషన్ రాజు, ఏసూరి మహేశ్, శ్రీకాంత్‌రెడ్డి, రాంబాబు, శ్రీరాములు తదితరులు కలిసి డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్‌కు అందజేశారు. దేవాలయం ఎదుట లైటింగ్, అదే విధంగా చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దసరా పండుగ సందర్భంగా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రోత్సవాలను జరుపుకుంటారన్నారు. బతుకమ్మ వేడుకల కోసం ఆయా ప్రాంతాల్లో వీధిదీపాలు ఇతరత్రా సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లేశ్, సురేశ్, సదానంద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



సదస్సుకు హాజరైన వివిధ విభాగాల వైద్యులు

రాంగోపాల్‌పేట్: గర్భిణులు వైద్య పరీక్షల కోసం వచ్చినపుడు తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిని సరిగ్గా అంచనా వేసి చికిత్స అందించాలని పలువురు సీనియర్ వైద్యులు సూచించారు. సికింద్రాబాద్ కిమ్స్ కడల్స్‌లో ఆదివారం హైరిస్క్ అబ్స్టెట్రిక్స్ అండ పెరినాటాలజీ (హోప్) సదుస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 250 మంది సీనియర్ గైనకాలజిస్టులు, కార్డియాలజీ, గ్యాస్ట్రో, నెఫ్రాలజీ, న్యూరో సర్జన్లు హాజరై తమ విభాగాల్లో తల్లీబిడ్డలకు ఎలాంటి సమస్యలు వచ్చాయని, వాటికి ఎలా చికిత్స అందించినది మిగతా వైద్యులకు వివరించారు. కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, కిమ్స్ కడల్స్ క్లినికల్ డైరెక్టర్ బాబు మదార్కర్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ త్రిపుర సుందరి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వేమ పద్మావతి తదితరులు హాజరయ్యారు. గర్భిణులకు పరీక్షలు చేస్తే ఆమెతో పాటు శిశువుకు అనేక సమస్యలు ఉండొచ్చని, వాటన్నిటికి చికిత్స చేయడానికి అన్ని విభాగాలు ఒకేచోట ఉండాలని తెలిపారు. అలాగే అన్ని విభాగాల వైద్యులకు సమన్వయం అవసరమని అప్పుడే తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని చెప్పారు. గర్భిణులు తప్పకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని తద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం కాపాడుకోవచ్చని తెలిపారు.

హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకోం

బంజారా నాయకులు

అమీర్‌పేట: ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తివేయాలని కుట్రలు పన్నుతున్నారని, తమ హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకోమని బజారా నాయకులు హెచ్చరించారు. రిజర్వేషన్లను తొలగించాలని మాజీ ఎంపీ సోయం బాబురావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ సుప్రీం కోర్టులో పిల్ వేయడాన్ని నిరసిస్తూ ఆదివారం అమీర్‌పేట బాపూనగర్‌లో లంబాడా (బంజారా) ఆత్మగౌరవసభ నిర్వహించారు. బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిసింగ్‌జాదవ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జరిగిన సభలో పలువురు నాయకులు మాట్లాడారు. ఎస్టీ జాబితాలో అనేక ఉపకులాలు ఉండగా కేవలం బంజారాలకు మాత్రమే రిజర్వేషన్లు లేకుండా చేయాలని డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 ఏళ్లు పూర్తైయిందన్నారు. నాడు ఎమ్మెల్యేగా ఉన్న రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో బస్తీ నాయకులు స్వామినాయక్, అమర్‌సింగ్



ఆత్మగౌరవ సభలో పాల్గొన్న బంజారా సంఘం నాయకులు

రాథోడ్, దీప్‌లాల్ చౌహాన్ తదితరులు లంబాడి తెగకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలంటూ పోరాటం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన ఆదిలాబాద్ మాజీ ఎంపీ బాబురావుకు సోయి లేదని, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు తెలివి లేదని విమర్శించారు. మా హక్కులకు భంగం కలిగించే వ్యక్తులకు తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎం.గోపీలాల్‌చౌహాన్, చెరణ్‌సింగ్, ప్రతాప్‌నాయక్, కృష్ణకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ ధర్నా

అడ్డగుట్ట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి వెంటనే నష్టపరిహారం అందించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అడ్డగుట్ట డివిజన్‌లోని మారేడ్‌పల్లి మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ ధర్నాకు వరద బాధితులతో పాటు సీపీఐ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

అన్నానగర్‌లో పర్యటించిన కార్పొరేటర్

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ అన్నానగర్‌లో స్థానిక కార్పొరేటర్ సామల హేమ ఆదివారం పర్యటించి, ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు కూలిన నాలా ప్రహరీ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. నాలా పరీవాహక ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలు తన దృష్టికి తెస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మి, రూపేష్ బస్తీపెద్దలు పాల్గొన్నారు.

హాస్టల్, మెస్ వర్కర్లకు జీతాలు పెంచాలి



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ హాస్టల్, మెస్ వర్కర్లకు జీతాలు పెంచాలనీ టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓయూలో టీయూసీఐ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్టు అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఓయూ హాస్టల్, మెస్ వర్కర్ల జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎల్ పద్మ, జిల్లా కార్యదర్శి కె.ఎస్.ప్రదీప్, ఆర్. శంకర్, శివాజీ, ఈశ్వరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్స్ అండ్ మెస్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నాలుగేళ్ల నుంచి వేతనాలు పెంచలేదన్నారు. చాలీ చాలనీ బతుకులతో నానా అవస్థలు పడుతున్నారన్నారు. పని భారం పెరిగి పలువురు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. కావునా వెంటనే జీతాలు పెంచేలా యూనివర్సిటీ నిర్ణయం తీసుకోవాలని అన్నారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఆకలి తీరుస్తున్న ఆర్యవైశ్య సంఘాలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్‌గౌడ్

బౌద్ధనగర్: అమావాస్యను పురస్కరించుకొని బౌద్ధనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెల్దే రవికుమార్ గుప్తా ఆధ్వర్యంలో అంబర్ నగర్ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అనేకచోట్ల అమావాస్యను పురస్కరించుకొని అన్నదానాలు చేస్తూ వేల మంది పేద ప్రజల ఆకలి తీర్చుతున్నారన్నారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు పొందుతూ వైశ్యులంతా కూడా సేవాభావంతో శ్రమించి ప్రజాసేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నందుకు వారిని అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రొద్దుటూరు వెంకటేశ్వరరావు, పాలూరు సురేశ్, పాలెం గోవిందరాజులు, సురేశ్‌కుమార్, బీజగం శ్రీనివాస్, అల్లాడి హరీశ్‌కుమార్, గుండా శ్రీనివాస్ గుప్తా, భూశెట్టి శ్రీనివాస్, గునిశెట్టి వెంకటేష్, ప్రభాకర్ గుప్తా, బీజేపీ జాయింట్ కన్వీనర్ దత్తు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకుడు రవిప్రసాద్‌గౌడ్

దేవీనవరాత్రులకు పటిష్ట బందోబస్తు



మండప నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్

చిలకలగూడ: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు. మండప నిర్వాహకులతో ఠాణా ప్రాంగణంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సలహాలు, సూచనలు అందించారు. మండప నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలని, డీజేలకు అనుమతి లేదన్నారు. చిలకలగూడ ఠాణా పరిధిలో ఇప్పటివరకు అందిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ ఆంజనేయులు, ఎస్ఐలు రవికుమార్, మనుషాలతో పాటు మండప నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే పోర్టర్ల సమస్యలు పరిష్కరించాలి

చిలకలగూడ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, రైల్వే పోర్టర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రిటైర్డ్ సీనియర్ రైల్వే అధికారి, రైల్వే పోర్టర్ల సంఘ ప్రధాన సలహాదారుడు ఆర్‌వీఎస్ రాఘవరావు కోరారు. ఈమేరకు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే (ఎన్ఎఫ్ఐఆర్) ప్రధాన కార్యదర్శి రాఘవయ్యను చిలకలగూడ కార్యాలయంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8వ వేతన సంఘ అధ్యక్షుడితో పాటు సభ్యులను తక్షణమే నియమించి పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, రైల్వే పోర్టర్ల సమస్యలను పరిష్కరించాలని, 18 నెలల డీఏ, డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, రైల్వే పోర్టర్లు, అసంఘటిత కార్మికుల న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎన్ఎఫ్ఐఆర్ చేపట్టే ఉద్యమాలకు, కార్యాచరణకు తమ సంఘం మద్దతు ఇస్తుందని ఆర్‌వీఎస్ రాఘవరావు స్పష్టం చేశారు. అనంతరం ఎన్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాఘవయ్య, జోనల్ కార్యదర్శి భరణీభానుప్రసాద్‌లను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.



ఎన్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి రాఘవయ్యకు వినతిపత్రం అందిస్తున్న ఆర్‌వీఎస్ రాఘవరావు

ఒక్కేసి పువ్వేసి.. చందమామా

ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు

సనత్‌నగర్: బతుకమ్మ వేడుకలను సనత్‌నగర్ నియోజకవర్గంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సంప్రదాయ వస్త్రాలంకరణతో యువతులు, మహిళలు రంగురంగుల బతుకమ్మలను ఒక్కచోట పేర్చి ఆడిపాడారు. జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. కాలనీ రెండో వీధిలోని అనంతరెడ్డి బంగ్లా వద్ద జరిగిన వేడుకలకు కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాలనీ ఫెడరేషన్ సహకారంతో ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డిప్రభ, ప్రధాన కార్యదర్శి, దేవాదాయ శాఖ మాజీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.అన్నపూర్ణలతో పాటు కమిటీ సభ్యులు ఉత్సవాలను వైభవంగా జరిపారు. ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రతినిధులు సోమ వెంకట్, పూర్మానీ మల్లారెడ్డి, రేణుమాను బాషా తదితరులు బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

